క్లుప్తంగా

నవోదయ పరీక్షలో ఉత్తమ ప్రతిభ


జశ్వంత్ కుమార్‌రెడ్డి

పెనుకొండ: జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థిని జశ్వంత్ కుమార్ రెడ్డి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడని కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యార్థిని పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో అభినందించారు.

ఓటరు నమోదుపై శిక్షణ


మాట్లాడుతున్న తహసీల్దార్ బాబు

లేపాక్షి: స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై స్థానిక తహసీలార్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులకు శుక్రవారం ఓటరు నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ బాబు మాట్లాడుతు ఫారం–6, 7, 8, 8ఎలను పోలింగ్ బూత్ పరిధిలో తీసుకుని పూర్తి చేసి వాటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా జులై 21 నుంచి ఆగస్ట్ 21 వరకూ ఇంటింటికి వెళ్లి సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమీలమ్మ, ఎన్నికల డేటా ఎంట్రీ ఆపరేటర్ అశోక్, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

పరిగి: ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నరేంద్రరెడ్డి తన జన్మదినం సందర్భంగా 20 కుర్చీలను అందజేశారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీదేవి, ఎంఈఓ–2 శేషాచలం, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ పూల చౌడప్ప, సర్పంచ్ దిలీప్‌కుమార్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, నంజప్ప, కృష్ణ, సంజీవప్ప, సచివాలయ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే


ధర్మపురం వార్డులో ఇంటింటి సర్వే చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సిగ్మా రీసెర్చ్ కన్సల్టెన్సీ సభ్యులు, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మంజుశ్రీ ఆధ్వర్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేను చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని ధర్మపురంలో ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. మాతాశిశు సంరక్షణ, రక్తహీనత, పోషణ, వ్యాధి నిరోధక టీకాలు, నీరు, పారిశుధ్యం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి మాట్లాడుతూ సర్వేలను పూర్తి చేసి నివేదికలను ఇండియన్ పాపులేషన్ ప్రాజెక్ట్‌కు వివరాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సర్వే కోఆర్డినేటర్ గోవిందయ్య, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి

మడకశిరరూరల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని స్థానిక సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి సూచించారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మత్తుపానీయాల నివారణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని రామకృష్ణ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మత్తు పదార్థలు వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్‌కు దేహశుద్ధి



సోమందేపల్లి: అతివేగంగా వచ్చిన ఓ ప్రైవేట్ బస్సు లారీని ఢీ కొట్టింది. ఆ బస్సు డ్రైవర్‌కు తోటి వాహనదారులు దేహశుద్ధి చేసిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. కియా పరిశ్రమ వైపు నుంచి అందులో పనిచేసే సిబ్బందితో ఓ ప్రైవేట్ బస్సు జాతీయ రహదారిపై వేగంగా వెస్తూ బెంగళూరు వైపు వెళ్లే లారీని వెంకటాపురం తాండా వద్ద ఢీకొట్టింది. గమనించిన తోటి ఇతర వాహదారులు ఆ బస్సును స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద నిలిపేశారు. డ్రైవర్‌పై చేయి చేసుకున్నారు. కొద్ది సేపు జాతీయ రహదారిపై ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలకు నచ్చజెప్పి స్టేషన్‌కు తరలించారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం 19వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ ఆధ్వర్యంలో స్థానికులు ఘనంగా స్వాగతించారు. ఎమ్మెల్సీ ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిర్వచనమన్నారు. ప్రతిపక్ష టీడీపీ, పవన్‌కళ్యాణ్, బీజేపీ నాయకులందరిదీ ఒక్కటే సిద్ధాంతమని, ప్రజల్లో దూసుకెళ్తున్న జగనన్న రథచక్రాలను అడ్డుకోవాలన్నదే వారి లక్ష్యమన్నారు. ప్రజలకు మంచి చేయాలని తపన పడుతున్న సీఎం జగన్‌కు ఇబ్బంది కల్గించాలని కుట్రలు పన్నుతున్నారన్నారు. పవన్‌కళ్యాణ్ మాటల్లో స్పష్టత లేదన్నారు. పవన్‌కళ్యాణ్ తీరుపై నమ్మకం సన్నగిల్లి టీడీపీ కూడా జనసేనతో పొత్తుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ కూడా పవన్‌తో లాభం లేదనుకుంటోందన్నారు. చంద్రబాబు కర్ణాటక మేనిఫెస్టో కాపీ కొట్టి జగన్‌మోహన్‌రెడ్డి కంటే అధికంగా ఏం మేలు చేయగలడో చెప్పలేక పోతున్నాడని ఎద్దేవా చేశారు ఎవరు ఎన్ని ఎత్తులు వేసినా దేవుడు దయ.. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతవరకు జగనన్నకు ఎదురులేదన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జబీవుల్లా, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా యువత అధ్యక్షుడు లోకేష్, జెడ్పీటీసీ నాగభూషణం, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ పురుషోత్తంరెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన చైర్‌పర్సన్ ఇంద్రజతో కలసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని 19వ వార్డులో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారథులు ప్రతిఇంటికి సందర్శించి ప్రజల సమస్యలు వంద శాతం పరిష్కరించేదిశగా కృషి చేయాలన్నారు.

ప్రజలకు సదుపాయలు కల్పించడమే లక్ష్యం

మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో అభివృద్ధి చేపట్టి ప్రజలకు సదుపాయలు కల్పించడమే లక్ష్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు పోతోందని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. పట్టణంలోని 6వ వార్డు ధర్మపురం వద్ద రూ.7లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ భూమిపూజ చేశారు. గత ప్రభుత్వ పాలనలో పీఏబీఆర్ పథకంపై అశ్రద్ధ చూపడం వల్ల ఆ ఫలితాలు నేడు అనువించాల్సివస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జబీవుల్లా, కమిషనర్ ప్రమోద్‌కుమార్, వార్డు ఇన్‌చార్జి మల్లికాబాను, కౌన్సిలర్లు ఆయుబ్, రహమత్‌బీ, రోషన్‌అలీ, కోఅప్షన్‌సభ్యులు రహమత్, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, లతీఫ్‌శెట్టి, ఇలియాజ్, కార్తీక్, ఫకృద్దీన్, హుమయూన్, కదిరీష్, దాదు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాల ప్రదానం


విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

రొద్దం: నారనాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన శృతి (507), ప్రవల్లిక (447), బేబి శ్యామల (386)లకు పురస్కారాలు, మెడల్స్ అందజేశారు. అలాగే రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 చొప్పున నగదు బహుమతులను హెచ్‌ఎం రంగప్ప అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు అవుల లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ డీలర్ లక్ష్మీనారాయణ, వార్డు మెంబర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

28న జగన్నాథ రథయాత్ర


మాట్లాడుతున్న ఇస్కాన్ సభ్యులు

హిందూపురం టౌన్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈ నెల 28న జగన్నాథ రథయాత్ర మహోత్సవం చేపట్టినట్లు ఇస్కాన్ హిందూపురం శాఖ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి పాతూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు జగన్నాథ రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ముద్దిరెడ్డిపల్లి మెయిన్ రోడ్డు, తెలుగుతల్లి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, మెయిన్ బజార్, వాసవీ ధర్మశాల రోడ్డు, రైల్వేరోడ్డు, మున్సిపల్ కార్యాలయం నుంచి టీటీడీ కల్యాణ మండపం చేరుకుంటుందన్నారు. టీటీడీ కల్యాణ మండపంలో సాయంత్రం 5 గంటల నుంచి ప్రవచనాలు, భక్తి గానాలు, భజనలు, తులసీపూజ, జగన్నాథ లీలలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పామిశెట్టి శేఖర్, మంచాల మారుతి, నామాల రవి, మోహన్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు జగనన్న సురక్షపై మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మడకశిరరూరల్: గ్రామ స్థాయిలో ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని ఎంపీడీఓ సోనిబాయి సిబ్బందికి సూచించారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జీవీ పాళ్యం గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ సిబ్బంది, వలంటీర్లుతో కలిసి ప్రత్యక్షప్రసారం ద్వారా తిలకించారు. రొళ్ల: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చడానికి చర్యలు తీసుకొందామని వెల్ఫేర్ అసిస్టెంట్ రామాంజనేయులు వలంటీర్లకు సూచించారు. శుక్రవారం బీజీ హళ్లి సచివాలయం ఆవరణలో సర్పంచ్ సదాశివప్ప ఆధ్వర్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' పథకం కార్యక్రమంపై సచివాలయం సిబ్బందితో కలిసి వలంటీర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, గృహ సారథులు, వీఆర్వో, కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు చేరాయా లేదా ఇంక ఏవైనా పథకాలు రాలేదా తదితర వివరాలను నమోదు చేయాలన్నారు.

అమరాపురం: మండలంలో ఈ నెల 1 నుంచి జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేద్దామని ఎంపీపీ ఈరన్న, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆలదపల్లి, వి.అగ్రహారం గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.


అమరాపురం: ఆలదపల్లిలో మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి

సీఎం సందేశాన్ని విన్న అధికారులు

పెనుకొండ రూరల్/రొద్దం/పరిగి/పెనుకొండ: తాడేపల్లి నుంచి సీఎం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు వీక్షించారు. ప్రతి సచివాలయంలో 11 రకాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు ప్రజలకు అందించేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారికి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ నూతన గృహప్రవేశం

హిందూపురం: ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ శుక్రవారం నూతన గృహప్రవేశం చేశారు. ప్రశాంత్‌నగర్‌లో ప్రస్తుతమున్న ఇంటి పక్కనే ఉన్న మరో అద్దె ఇంట్లోకి ఆయన చేరారు. సంప్రదాయ పద్ధతిలో ముస్లిం మతపెద్దలు దువా చదివి, మదరసా విద్యార్థులతో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. అంతా మంచే జరగాలని ఆశిస్తూ ఎమ్మెల్సీను ముస్లిం పెద్దలు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

హిందూపురం: పట్టణంలో పలు చోట్ల శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ కృష్ణవేణి శుక్రవారం తెలిపారు. డీబీ కాలనీ, నానెప్పనగర్, శ్రీకంఠపురం, మోడల్ కాలనీ, డీఆర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, చైతన్యనగర్, త్యాగరాజ్‌నగర్, శాంతినగర్ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగించడానికి, మరమ్మతుల కారణంగా కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సిమెంట్ రికవరీ చేసి పనులు ప్రారంభించండి

- పీఆర్ ఈఎన్‌సీని కోరిన ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గంలో గోల్‌మాల్ చేసిన సిమెంట్‌ను బాధ్యుల నుంచి రికవరీ చేసి అభివృద్ధి పనులను ప్రారంభించాలని శుక్రవారం విజయవాడలో పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్‌ను కలిసి కోరినట్లు స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. మడకశిర పంచాయతీరాజ్‌శాఖలో సిమెంట్ గోల్‌మాల్ కావడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయని ఈఎన్‌సీకి వివరించానన్నారు. వెంటనే ఈఎన్‌సీ స్పందించి జిల్లా ఎస్‌ఈ భాగ్యరాజ్‌కు ఫోన్ చేసి గోల్‌మాల్ అయిన సిమెంట్‌ను రికవరీ చేసి ఆగిపోయిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిపారు. అదే విధంగా మడకశిరలో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఆగిపోయిన అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేయాలని ఆశాఖ సీఈ శ్రీనివాసరెడ్డిని కూడా కలిసి కోరినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. వెంటనే ఆగిపోయిన పనులకు మళ్లీ టెండర్లు పిలిచి పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి సీఈకి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కూడా కలిసి మడకశిర నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ పనులను అపాలని కోరినట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా గనులశాఖ ఎండీ వెంకటరెడ్డిని కూడా కలిసి అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మడకశిర ప్రాంతంలో అక్రమ మైనింగ్ పనులను అపడానికి చర్యలు తీసుకొంటామని వారు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు.

ప్లాస్టిక్‌రహిత పట్టణంగా మార్చండి

హిందూపురం టౌన్: హిందూపురాన్ని ప్లాస్టిక్‌రహితంగా మార్చడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను హిందూపురం పన్ను చెల్లింపుదారుల సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి మెమోరాండం అందజేసిన అనంతరం సత్కరించారు. వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలు పన్ను చెల్లింపు విషయాల్లో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నీటి సమస్య, పారిశుధ్య సమస్యను వివరించి వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సతీష్, డైరెక్టర్లు కార్తీక్, వెంకటేశ్వర్లు, వ్యాపారులు కల్యాణ్, బాలు, ప్రాణేష్, రఘు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలో శుక్రవారం కియా పరిశ్రమ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా కియా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్యాంగ్ లీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు ఉచితంగా కుట్టు శిక్షణను ఇస్తున్నామన్నారు. ఇందుకోసం రూ.40 లక్షలకు పైగా నిధులను వెచ్చించడం జరిగిందన్నారు. ఏడాది పొడవునా 3 బ్యాచ్‌లకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలపారు. ఒక్కో బ్యాచ్‌లో 75 మంది మహిళలకు 3 నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. రోజుకు రూ.350 చొప్పున స్టైఫండ్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన మహిళలు సొంత సంస్థలను స్థాపించే స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో టింబక్ట్ కలెక్టివ్ ప్రతినిధులు బబ్లూ గంగూలీ, మేరీ వట్టముట్టం, డైరెక్టర్లు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన మహిళలతో కియా యాజమాన్యం

పురుషులకు దీటుగా మహిళలు ఎదగాలి


మాట్లాడుతున్న ఆర్డీటీ డైరెక్టర్ దాదా

రొళ్ల: సమాజంలో పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో మహిళలు ఎదగాలని ఆర్డీటీ మెయింటెనెన్స్ డైరెక్టర్ దాదా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణలో ఒంటరి మహిళ సాధికార దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సమాజంలో గౌరవంగా మెలిగి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఆర్డీటీ సంస్థ ద్వారా ఒంటరి మహిళలను గుర్తించి ప్రతి ఆరు నెలలకు ఒక సారి నిత్యావసర సరుకులతో పాటు పిల్లల చదువుకు అన్ని విధాలుగా సహాయ సహకారం అందిస్తామన్నారు. పిల్లలను సక్రమంగా పాఠశాలలకు హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకుని ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఆర్డీటీ తరఫున మహిళ సంఘాలను ఏర్పాటు చేసి పొదుపు చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. తర్వాత మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు చీరలను బహుమతిగా అందజేశారు. ఏటీఎల్ సుబ్బారావు, ఎంఅండ్‌ఈ ఎస్టీఎల్ రామకృష్ణ, సీఓలు లక్ష్మీదేవి, కీర్తి, రవికుమార్, మంజునాథ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు పౌష్టికాహారం అందించండి

పెనుకొండ రూరల్: మునిమడుగు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లను సీడీపీఓ శాంతలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. పిల్లలు, గర్భవతులకు నిర్దేశించిన గడువులోపు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎర్రమ్మ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తతతో పని చేయాలి


మాట్లాడుతున్న పరమేశ్వర్

పావగడ: అధికారులు అప్రమత్తతో పని చేయాలని లేని పక్షంలో రాష్ట్రాభివృద్ధి కుంటు పడుతుందని రాష్ట్ర హోం శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డా జి పరమేశ్వర్ ఆదేశించారు. స్థానిక టీపీఎస్ సభాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కేడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాలూకా వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఏ ఒక్క అధికారి కూడా సరైన డేటా అందించలేదని మండిపడ్డారు. తహసీల్దార్ సుజాత, ఆహార ధాన్యాల సరఫరా శాఖ ఏడీ కృష్ణమూర్తి రేషన్ కార్డులకు సంబంధించిన కుటుంబాలు, బీపీఎల్, ఏపీఎల్, అంత్యోదయ కార్డుదారుల వివరాలు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం మంత్రి పరమేశ్వర్ స్థానిక తిరుమణి సోలార్ పార్క్ ను సందర్శించారు. ఈ సందర్భంగా కేఎస్‌పీడీసీఎల్ అధికారులు మంత్రి పరమేశ్వర్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపిక ను బహూకరించారు. స్థానిక మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఎమ్మెల్యే వెంకటేశ్ ను సైతం ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.


సంక్షిప్త సమాచారం

కుష్టు నివారణపై అవగాహన



రొళ్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) ఆవరణలో శుక్రవారం ఎంపీహెచ్‌ఈఓ షమీవుల్లా ఆధ్వర్యంలో కుష్టు నివారణపై ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఈనెల 26 నుంచి జులై 16 వరకు సర్వే చేయాలన్నారు. ఇందులో స్పర్శ లేని, రాగి రంగు మచ్చలు కలిగిన వారిని గుర్తించాలన్నారు. కుష్టు బాధితులగా తేలితే వారికి 8 నెలలు, ఏడాది పాటు చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సుధారాణి, ఎంపీహెచ్‌ఈఓ ఖాదర్‌వలీ, సూపర్‌వైజర్లు కిరణ్‌కుమార్, శ్రీలక్ష్మీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కవితా గోష్టికి యువకవి చంద్రశేఖర్



హిందూపురం టౌన్: శ్రీశ్రీ కళావేదిక కర్ణాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న మైసూరులో జరగనున్న తెలుగు–కన్నడ కవితా గోష్టికి హిందూపురానికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు, యువ కవి పి.చంద్రశేఖర్ ఎంపికయ్యారు. ఈ మేరకు అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఓ లేఖలో పేర్కొన్నారని శుక్రవారం చంద్రశేఖర్ తెలిపారు. ఆయన ఎంపికపై ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు సంకల్ప సంపూర్ణ స్వాస్థ్య కార్యక్రమం

హిందూపురం టౌన్: చిన్న పిల్లల వైద్యుల సమాఖ్య ఆధ్వర్యంలో సంకల్ప సంపూర్ణ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా 24న శనివారం స్థానిక పూలకుంటలోని లోటల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 4, 5వ తరగతి విద్యార్థులకు 'పాఠశాల విద్యార్థుల ఆరోగ్య అవగాహన' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేశవులు, ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ రామచంద్రరావు, ఉప కార్యదర్శి డాక్టర్ మదన్‌కుమార్, కోశాధికారి డాక్టర్ సుప్రవీణ శుక్రవారం తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చిలమత్తూరు: ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక పీఎస్‌లో మండలంలోని ప్రైవేటు పాఠశాలల బస్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థులున్న బస్సులను అజాగ్రత్తగా నడపవద్దని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

పరిగి: ఎర్రగుంట్లలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని స్థానిక ఎస్సీ కాలనీ వాసులు శుక్రవారం తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో బస్టాండు సర్కిల్‌లో విగ్రహ ఏర్పాటుకు దాదాపు పనులు పూర్తి చేసినప్పటికీ ఓ వ్యక్తి అభ్యంతరం చెప్పడంతో ఆగిపోయిందన్నారు. గ్రామంలో 95–7 సర్వే నంబర్‌లో ఖాళీగా ఉన్న 15 సెంట్ల స్థలాన్ని అంబేడ్కర్ విగ్రహంతో పాటూ కమ్యూనిటీ భవన నిర్మాణానికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజినప్ప, మాజీ ఎంపీపీ గోవిందప్ప, రమేష్, కేవీపీఎస్ నాయకులు రమణ, నాగరాజు ఉన్నారు.

విధులకు హాజరు కాకపోతే చర్యలు

మడకశిరరూరల్: పాఠశాలలకు సక్రమంగా విధులకు హాజరుకాని ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ భాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన డీ రామగిరి ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుడు హాజరుకాకపోవడంతో సదరు ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. ఆమిదాలగొంది పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం అడ్మిషన్లపై చర్చించారు. ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందన్నారు.

మసీదు వద్ద ఘర్షణ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని స్నేహలత నగర్‌లో ఉన్న ఫాజియా మసీదు వద్ద శక్రవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వివరాలు.. మసీదుకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మసీదు కమిటీ సభ్యులు షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. నలుగురు వ్యక్తులు నిర్మాణాలు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. దీంతో సమస్య సద్దు మణిగింది.

ప్రధానోపాధ్యాయులకు సన్మానం



లేపాక్షి: మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మనోజ్ ఆరాధ్య, పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణమోహన్‌రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ సీలావతి, సర్పంచ్‌లు అశ్వత్త నారాయణ, వసుంధర, ఎంఈఓ–2 కుళ్లాయప్ప, కొండూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషగిరి బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

హిందూపురం టౌన్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదర్శ్‌కుమార్, వరప్రసాద్, శంకర్, దివాకర్ నాయుడు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుభాష్, రామకృష్ణ, రామాంజినేయులు, మేదర శీనా, రవి, హనుమంతు, సూరి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: స్థానిక ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బద్రి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు.

తహసీల్దార్‌కు సన్మానం

అగళి: తహసీల్దార్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జమానుల్లాఖాన్‌ను ఎంపీపీ రేణుక కామరాజు, రావుడి సర్పంచ్ బసవరాజు, ఎంపీటీసీ నింగమ్మ బసవరాజు తదితరులు శుక్రవారం శాలువా, పూల మాల వేసి ఘనంగా సన్మానించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

గోరంట్ల: మండలంలోని బూదిలి జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం రూరల్ అగ్రికల్చరల్ సోసైటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ జాతీయ అవార్డు గ్రహీత రెడ్డివారి శంకరనారయణ మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థులు చెట్లను పెంచాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యయుడు జనార్దనరెడ్డి, రూరల్ అగ్రికల్చరల్ సోసైటీ అధ్యక్షుడు మదనమోహన్ రెడ్డి, నార్శింపల్లి రామలింగా రెడ్డి పాల్గొన్నారు.